

ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఇస్తున్న చంద్రబాబు, పవన్



పండుగలా పట్టాభిషేకం



అట్టహాసంగా టీడీపీ కూటమి ప్రమాణస్వీకారం

జనం జనం కలిసి ప్రభంజనమైనట్టు.. ప్రమాణస్వీకార మహోత్సవం మహాపట్టాభిషేకాన్ని తలపించింది. ప్రజాతీర్పునకు పట్టంకడుతూ అతిరథ మహారథులు కదలివచ్చారు. అటు కేసరపల్లిలోని సభా ప్రాంగణం.. ఇటు జాతీయ రహదారి.. గన్నవరం విమానాశ్రయం కోలాహలంగా మారాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్‌షా, ఎన్వీ రమణ, వెంకయ్యనాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ సహా సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి, బాలకృష్ణ తదితరులు వేదికపై ముందు వరుసలో నిలిచారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, అచ్చెన్నాయుడు.. ఇతర మంత్రివర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. నారా, నందమూరి, కొణిదెల కుటుంబాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, రాష్ట్ర నలుదిక్కుల నుంచి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు 'విజయీభవ..' అంటూ నూతన ప్రభుత్వానికి ఆశీస్సులు అందజేశారు.

- కొలువుదీరిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహా మంత్రివర్గం
- హాజరైన ప్రధాని మోదీ, అమిత్‌షా, ఎన్వీ రమణ, వెంకయ్యనాయుడు
- ప్రత్యేక ఆకర్షణగా సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి
- రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు
- కిక్కిరిసిన కేసరపల్లి.. కిటకిటలాడిన జాతీయ రహదారి
- అతిరథులకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : ప్రమాణస్వీకార మహోత్సవానికి ఊరూవాడా కేసరపల్లివైపు కదిలింది. అటు శ్రీకాకుళం, ఇటు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా కదలివచ్చారు. తొక్కిసలాటలకు ఆస్కారం లేకుండా జాతీయ రహదారిపై అక్కడక్కడ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి నిలువరించే ప్రయత్నం చేసినా, వాటిని తోసుకుని మరీ కార్యకర్తలు తరలివచ్చారు. ఎవరికి వారు సొంతంగా బస్సులు మాట్లాడుకుని, వాహనాల్లో రావడం విశేషం. టీడీపీ, జనసేన కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో రావడంతో కేసరపల్లి కిటకిటలాడింది. 50వేల మందికి మాత్రమే గ్యాలరీలు ఏర్పాటు చేయగా, మరో లక్షమంది అదనంగా వచ్చారు. దీంతో జాతీయ రహదారి రద్దీగా మారిపోయింది. బుధవారం ఉదయం 5 గంటల నుంచే జన కోలాహలం మొదలైంది. భారీగా చేరుకున్న కార్యకర్తలు బారికేడ్లను తోసుకుని లోపలికి వెళ్లిపోయారు. పోలీసులు నియంత్రించే పరిస్థితులు లేకపోవడంతో కార్యకర్తలు గ్యాలరీల్లోకి వెళ్లిపోయారు. సగం గ్యాలరీలు కార్యకర్తలతో నిండిపోయాయి. ఇక పాస్‌లు అందుకున్న వీవీఐపీలు, వీఐపీలు 9 నుంచి 10 గంటల మధ్యలో వచ్చారు. వీరంతా గ్యాలరీలకు చేరుకునేసరికి కొంతసమయం పట్టింది. వీఐపీలకు కూర్చునే అవకాశమే దక్కలేదు. నిలబడి ఎల్‌ఈడీ స్క్రీన్లపై వీక్షించారు. వీఐపీలంతా కేసరపల్లి మేధ ఐటీ పార్క్ రోడ్డు నుంచి వెటర్నరీ కాలేజీ వెనకగా సభాస్థలికి వెళ్లాల్సి వచ్చింది. ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ, తిరువూరు నుంచి వచ్చిన వారంతా ఎయిర్‌పోర్టుకు అభిముఖంగా ఉన్న ఎంట్రీ పాయింట్‌కు చేరుకున్నారు. వారందరినీ పోలీసులు నిలుపుదల చేశారు. లోపలికి పంపించాలని కార్యకర్తలు గొడవ చేయటంతో పోలీసులు లోపలికి వదిలారు. దీంతో కార్యకర్తలంతా పరుగులు పెట్టుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్లపై వీక్షణ

ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించటం సాధ్యం కాని వారంతా జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్లను ఆశ్రయించారు. అక్కడే కూర్చుని ప్రమాణ స్వీకారాన్ని చూశారు. అభిమాన నేత ప్రమాణం చేస్తున్నప్పుడు హర్షధ్వానాలు మిన్నంటాయి.



కూటమి జెండాలతో వినూత్నంగా ఓ అభిమాని

మన మంత్రివర్యులు



వేధింపుల నుంచి విజయం దిశగా..

- రెండోసారి మంత్రిగా కొల్లు రవీంద్ర ప్రమాణస్వీకారం
- నూజివీడు నుంచి గెలిచి మంత్రిగా పార్థసారథి



- 6లో..

నేడే బడి

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- జగనన్న విద్యాకానుక స్థానంలో 'స్టూడెంట్ కిట్స్'
- పూర్తిగా అందుబాటులోకి రాని పాఠ్యపుస్తకాలు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బడిగంట మోగింది. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో బుధవారం నుంచే పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉండగా, కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని ఒకరోజు ఆలస్యంగా తెరవాలని నిర్ణయించారు.

నేడు స్టూడెంట్ కిట్‌ల అందజేత

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పాఠశాలల పునఃప్రారంభం రోజే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'స్టూడెంట్ కిట్స్' పేరిట పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, సాక్సులు, బూట్లు, యూనిఫాం తదితరాలను ఇవ్వాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎంఈవోలను ఆదేశించారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లోని ఎంఆర్‌సీలలో పాఠ్యపుస్తకాలు, కిట్‌లు ఉన్నాయి. వీటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే, అన్ని తరగతులకు సంబంధించి పాఠ్యపుస్తకాలు రాలేదని టీచర్లు చెబుతున్నారు. కృష్ణాజిల్లాకు సంబంధించి 8,32,606 పుస్తకాలు రావాల్సి ఉండగా, 7,74,774 వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 8,85,466 పుస్తకాలు రావాల్సి ఉండగా, 7,75,036 వచ్చాయి. ఏడో తరగతికి సంబంధించి పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదని టీచర్లు చెబుతుండగా, రెండు రోజుల్లో వాటిని కూడా ఎంఆర్‌సీ పాయింట్లకు పంపుతామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు జగనన్న విద్యాకానుక పేరుతో పాఠ్యపుస్తకాలు, ఇతరత్రాలు అందించేవారు. బ్యాగులపై వైఎస్ జగన్ ఫొటో ఉండేది. ఈసారి అవి కొంతమేర వచ్చినా నిలిపివేశారు. జగనన్న విద్యాకానుక పేరుతో కాకుండా స్టూడెంట్ కిట్ పేరుతో రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా వీటిని అందజేస్తున్నారు.

నత్తనడకన నాడు-నేడు పనులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,086 పాఠశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయి. రెండో విడతలో రూ.437 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం, పాఠశాలల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఇతరత్రా సౌకర్యాలను కల్పించే పనులు జరుగుతున్నట్లు చెబుతున్నారు. అయితే, ఈ పనులు పూర్తిస్థాయిలో జరగట్లేదు. విద్యా కమిటీలు, ప్రధానోపాధ్యాయులు అంతగా ఈ పనులు చేసేందుకు ఆసక్తి కనబరచకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కొన్నిచోట్ల నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించి, ఆ బాధ్యతల నుంచి తమను తప్పించాలని పాఠశాలల హెచ్‌ఎంలు డిమాండ్ చేస్తున్నారు.

అకుంఠిత దీక్షతో..

ఐదేళ్ల విధ్వంసం తర్వాత అమరావతికి ఊపిరి

- మూడేళ్లలో రాజధాని గాడిన పడుతుంది
- రెండేళ్లలోనే అందరికీ అభివృద్ధి ఫలాలు
- మహిళా సాధికారత దిశగా అడుగులు
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ శ్రేణుల అంతరంగం



- 6లో..



చంద్రబాబు అనే నేను..



వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



కూటమి పార్టీల స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

వేధింపుల నుంచి

విజయం దిశగా..

- రెండోసారి మంత్రిగా కొల్లు రవీంద్ర ప్రమాణస్వీకారం
- ఐదేళ్లు వైసీపీ నేత పేర్ని నాని టార్గెట్‌గా రవీంద్ర
- రాజకీయంగా ఎదుర్కోలేక కేసులతో వేధింపులు
- సౌమ్యుడిగా పేరున్న రవీంద్రపై హత్యాయత్నం కేసు



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

అధికార మదం తలకెక్కితే.. ప్రత్యర్థిని రాజకీయంగా ఎదుర్కోలేనని తెలిపోతే.. వేధింపులు.. బెదిరింపులే అస్త్రాలవుతాయి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల ప్రతిపక్ష టీడీపీ నేతలకు అడుగడుగునా అవమానాలు.. వేధింపులు.. బెదిరింపులే ఎదురయ్యాయి. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2019లో వైసీపీ ఎమ్మెల్యేగా ఎన్నికై.. ఆ తర్వాత మంత్రి అయిన పేర్ని నాని కూడా తన ప్రత్యర్థి, మాజీ మంత్రి కొల్లు రవీంద్రను రాజకీయంగా ఎదుర్కోలేక వేధింపుల అస్త్రాన్నే నమ్ముకున్నారు. కానీ ఆయన అస్త్రం బెడిసికొట్టింది. సౌమ్యుడు.. వివాదరహితుడిగా పేరున్న రవీంద్రపై వేధింపులను.. ఆయనపై మోపిన హత్యాయత్నం కేసును ప్రజలు నమ్మలేదు. ఓటు అస్త్రాన్ని ప్రయోగించి పేర్నినానిని మట్టికరిపించారు. మచిలీపట్నం నియోజకవర్గ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో 50వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో కొల్లు రవీంద్రకు పట్టం కట్టారు. పార్టీ అధినేత చంద్రబాబు సైతం రవీంద్ర విధేయతను.. కష్టాలను గుర్తించారు. రెండోసారి మంత్రి పదవి కట్టబెట్టి గౌరవం కల్పించారు. బుధవారం కేసరపల్లి వద్ద జరిగిన కార్యక్రమంలో రవీంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

బనాయించిన కేసులో 53 రోజులపాటు జైలులో..

మత్స్యకార సామాజికవర్గానికి చెందిన రవీంద్రను 2019లో వైసీపీ గెలిచిన మరుసటి రోజు నుంచి వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. 2020 జూన్ 29న అప్పటి మంత్రి పేర్ని నాని సన్నిహితుడు, వైసీపీ నేత మోకా భాస్కర్‌రావును వ్యక్తిగత కక్షలతో కొందరు హత్య చేస్తే ఆ కేసును రవీంద్రపై బనాయించారు. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో జూలై 4న రవీంద్రను అరెస్టు చేసి జైలుకు పంపారు. రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీగా 53 రోజులు ఉన్న రవీంద్ర ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. వాస్తవానికి ఈ కేసులో నిందితులు హత్య జరిగిన మరుసటి రోజే జూన్ 30న లొంగిపోయారు. కానీ వారితో బలవంతంగా రవీంద్ర పేరు చెప్పించేందుకు జూలై 2 వరకు అరెస్టు చూపకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. రవీంద్రను ఈ కేసులో ఇరికించేందుకే పోలీసులు ఇలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. రవీంద్ర అనుచరుల విషయంలోనూ పేర్ని నాని అదే విధంగా వ్యవహరించారు. మున్సిపల్ అధికారులను చెప్పుచేతల్లో ఉంచుకుని ఎప్పుడో కట్టుకున్న ఇళ్లకు ప్లాన్లు సరిగా లేవంటూ కూల్చేసేందుకూ సిద్ధమయ్యారు. ఈ వేధింపులన్నింటినీ ఎదుర్కొంటూ.. అనుచరుల్లో ధైర్యాన్ని నింపుతూ కొల్లు రవీంద్ర పెద్ద పోరాటమే చేశారు. వీటన్నింటిపైనా కొల్లు రవీంద్ర న్యాయపరంగా పోరాడి విజయం సాధించారు. ఆయన పోరాటాలకు ఎట్టకేలకు గుర్తింపు లభించింది. ఎట్టలకే ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించడమే కాకుండా రెండోసారి మంత్రిగా పదవి చేపట్టారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ..

మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు రాజకీయ వారసుడిగా వచ్చిన కొల్లు రవీంద్ర తన స్వశక్తితో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. 2005లో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడిగా.. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా.. పనిచేసిన ఆయన ప్రస్తుతం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడి స్థాయికి ఎదిగారు. టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. కొల్లు ఫౌండేషన్ ద్వారా మచిలీపట్నం నియోజకవర్గంలో ప్రజలకు సేవలందిస్తున్నారు. 2009 నుంచి వరుసగా మచిలీపట్నం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఆయన రెండుసార్లు ఓటమిని రెండు సార్లు గెలుపును సొంతం చేసుకున్నారు. 2009, 2019లో ఆయన ఓటమి చెందగా 2014, 2024లో విజయం సాధించారు.

మంత్రిగా కొలుసు పార్థసారథి ప్రమాణ స్వీకారం..

ఏలూరుజిల్లా నూజివీడు నియోజకవర్గం నుంచి గెలుపొందిన కొలుసు పార్థసారథిని మంత్రి పదవి వరించింది. ఆయన 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఉయ్యూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా, 2009, 2019లలో పెనమలూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2009 నుంచి 2010 వరకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో పార్థసారథి పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, పాడి పరిశ్రమశాఖ అభివృద్ధి మంత్రిగా, 2010 నుంచి 2014 వరకు మాధ్యమిక విద్యాశాఖా మంత్రిగా విధులు నిర్వహించారు. 2024లో ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా గెలుపొందారు.



అకుంఠిత దీక్షతో..



- ఐదేళ్ల విధ్వంసం తర్వాత.. అమరావతికి ఊపిరి
- మూడేళ్లలో గాడిన పడుతుంది
- రెండేళ్లలోనే అభివృద్ధి ఫలాలు
- మహిళా సాధికారత దిశగా అడుగులు
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ శ్రేణుల అంతరంగం

బాబు 4.0

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం/ఉంగుటూరు)

'రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన నవ్యాంధ్రను చంటిబిడ్డలా కాపాడుకోవాల్సిన పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని 'మూడు ముక్కల'తో సర్వనాశనం చేసింది.. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల అరాచక, నియంతృత్వ పాలనకు ప్రజలు ఎట్టకేలకు చరమగీతం పాడారు.. గతి తప్పిన రాష్ట్రాన్ని పునర్నిర్మించుకునేందుకు తెలుగుదేశం పార్టీకి మరోమారు సువర్ణ అవకాశాన్ని కల్పిస్తూ ఈ ఎన్నికల్లో సంచలన తీర్పు ఇచ్చారు.. ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు పని చేస్తారనటంలో ఎలాంటి సందేహం లేదు.. అమరావతి రాజధాని నిర్మాణంలో నష్టపోయిన ఐదేళ్లను భర్తీ చేయటంతో పాటు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకువెళ్లే గురుతర బాధ్యతను కూటమి ప్రభుత్వం తప్పకుండా పూర్తిచేస్తుంది'.. అని సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రమాణస్వీకారోత్సవానికి వచ్చిన పలువురిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వారి మాటల్లోనే..

రాజధాని పునర్నిర్మాణానికి అడుగులు..

లెంకా బంగారునాయుడు(విజయనగరం)



ఐదేళ్ల వైసీపీ పాలనలో నవ్యాంధ్ర రాజధాని అమరావతిని విధ్వంసం చేశారు. ప్రజల కలలు సమిధలయ్యాయి. అమరావతి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు విస్పష్టమైన తీర్పు ద్వారా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు. మళ్లీ చంద్రబాబు కావాలన్న ఆకాంక్షతో తిరుగులేని మెజారిటీ ఇచ్చారు. అమరావతి పునర్నిర్మాణం కష్టతరమైనప్పటికీ అది చంద్రబాబు వల్లనే సాధ్యమౌతుంది. ఖచ్చితంగా మూడేళ్లలో అమరావతి వైభవం కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తుంది. ప్రజలంతా ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం విస్పష్ట తీర్పు..

పాట్నూరు అప్పలరామ్, మండపేట



రాష్ట్రం వైసీపీ ప్రభుత్వ కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడిపోయింది. గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడం కోసమే ప్రజలు సంచలన తీర్పు ఇచ్చారు. చంద్రబాబు మంచి పరిపాలకుడు. ఈసారి ఆయన సత్తా ఏమిటో ఏపీ ప్రజలు చూస్తారు. రాబోయే రెండేళ్లలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి చంద్రబాబు తీసుకువెళ్లగలరన్న నమ్మకం ఉంది.

కేంద్రంలో చంద్రబాబు చక్రం తిప్పుతారు

జి.గోవిందరావు (తుమ్మకాపల్లి)



రాష్ట్రంలో మంచి మెజారిటీ సాధించిన కూటమి ప్రభుత్వం.. కేంద్రంలోనూ చంద్రబాబు చక్రం తిప్పే పరిస్థితుల్లో ఉన్నారు. ఇది మంచి తరుణం. కేంద్రం ద్వారా రాష్ట్రానికి కావాల్సిన అన్నింటినీ సాధించుకోగలిగే అవకాశం ఉంది. గాడి తప్పిన రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలంటే ఇదే మంచి తరుణం. చంద్రబాబుపై రాష్ట్రం ప్రజలందరికీ మంచి అభిప్రాయం ఉంది. సంపద సృష్టించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించబోతున్నారు. గత ఎన్నికల్లో కూడా ప్రజలు ఆశీర్వదించి ఉంటే ఈ పాటికి పరిపూర్ణత వచ్చి ఉండేది.

పారిశ్రామికవిప్లవం రాబోతోంది..

అప్పలనాయుడు(ఇంగుమండం)



రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం రాబోతోంది. 2014-19లో చంద్రబాబు పాలనలో పారిశ్రామిక రంగానికి పెద్ద పీట వేశారు. ఎన్నో భారీ పరిశ్రమలు వచ్చాయి. అదేస్థాయిలో పెట్టుబడులు వచ్చాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో పరిశ్రమల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. మళ్లీ చంద్రబాబు పరిశ్రమలను తీసుకువస్తారు. ఈసారి పూర్తి స్థాయిలో ఖచ్చితంగా అమలు చేస్తారు.

పర్యాటకానికి నవశకం..

భూపతిరాజు సత్యనారాయణరాజు (భీమవరం)



టీడీపీ హయాంలో పర్యాటక శోభ కనిపించేది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రమోషన్స్ నిర్వహించేవారు. విజయవాడ వేదికగా మెగా ఈవెంట్లు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం పర్యాటకరంగాన్ని నాశనం చేసింది. భవానీ ద్వీపాన్ని టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిచేస్తే.. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసింది. పవిత్ర సంగమం, కృష్ణా హారతులను పక్కన పెట్టారు. గాడి తప్పిన పర్యాటకాన్ని పునరుద్ధరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రజల ఆకాంక్షలతో.. పరిపాలన

వడ్లమూడి మాధవరావు, తిరువూరు (7895)

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగుతుందని చంద్రబాబే చెబుతున్నారు. ఈసారి



టీడీపీ పాలన వినూత్నంగా ఉంటుంది. ప్రజలు కూడా బాధ్యతలను విస్మరించవద్దని చంద్రబాబు చెబుతున్నారు. ప్రజల భాగస్వామ్యంతో పరిపాలన సాగించడమన్నది మంచి విషయం. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

ప్రకృతి వనరుల లూటీ ఉండదు..

గూడవల్లి భవానీ సూర్య ప్రసాద్ (బుద్ధవరం)



వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా కొల్లగొట్టారు. యథేచ్ఛగా కాలువలు, చెరువులు, గట్లు తవ్వేశారు. టీడీపీ ప్రభుత్వం వీటిపై చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నా. కొత్త ప్రభుత్వంలో తవ్వకాలకు అక్రమ అనుమతులు ఇచ్చే ప్రశ్న ఉండదు. ఈ విషయంలో పూర్తి నమ్మకం ఉంది.

మహిళలకు సాధికారత..

కంబంపాటి లక్ష్మి, బుద్ధవరం



వైసీపీ పాలనలో మహిళలకు తీవ్ర అన్యాయం జరిగింది. మహిళలకు పథకాలు ఇస్తున్నట్టుగా నయవంచన చేశారు. టీడీపీ ప్రభుత్వం మహిళల కోసం ఇప్పటికే సూపర్‌సిక్స్‌లో పథకాలను ప్రకటించడం జరిగింది. వీటన్నింటినీ అమలు చేయటం ద్వారా సాధికారత పెరుగుతుంది.

బ్యాటరీ వాహన సేవలు ..

కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సభా ప్రాంగణానికి రెండు, మూడు కిలోమీటర్ల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు నడిచి వస్తున్న క్రమంలో వృద్ధులను తరలించేందుకు వీలుగా ఆచార్య నాగార్జునా యూనివర్శిటీ బ్యాటరీ వాహనాలను ఏర్పాటు చేసింది. ఈ వాహనాలు నిరంతరాయంగా సేవ చేశాయి.



హీరోరామ్‌చరణ్ సందడి ..

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక అతిథిగా వచ్చిన మెగాస్టార్ చిరంజీవి తన



యుడు రామ్ చరణ్ గన్నవరంలోని ఏటీ కన్వెన్షన్‌లో సందడి చేశారు. నిర్మాత కిలారు సతీశ్ సోదరుడు కిలారు సురేశ్, కాంట్రాక్టర్ ప్రత్తిపాటి శ్రీనివాసరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. గన్నవరం ప్రాంతానికి చెందిన కిలారు సతీష్ హీరో రామ్‌చరణ్‌తో సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు రామచరణ్‌తో ముచ్చటించారు.

ట్రాఫిక్ వలయంలో ఐటీ పార్క్..

మేథ ఐటీపార్కు రోడ్డు రద్దీగా మారింది. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా వీవీఐపీ, వీఐపీలు వారికి నిర్దేశించిన గ్యాలరీలకు వెళ్లేందుకు ఐటీ



పార్క్ రోడ్డును కేటాయించారు. ఈ రోడ్డునే కిలోమీటరున్నర పొడవున ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులను ఏసీ బస్సుల్లో సభాస్థలికి తరలించారు. వీవీఐపీల కాన్వాయ్‌లు కూడా ఈ రోడ్డు మార్గం నుంచే బయలుదేరాయి. డైరెక్టర్ బోయపాటి, సెలబ్రిటీల కార్ల కాన్వాయ్, వివిధ దేశాలకు చెందిన దౌత్యవేత్తల కార్ల కాన్వాయ్ కూడా ఇదే మార్గంలో వెళ్లాయి. దీంతో మేధా ఐటీ పార్కు రోడ్డు వాహనాలతో రద్దీగా మారిపోయింది.

ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్ చేదు అనుభవం

సీనియర్ ఐఏఎస్ అధికారి, జగన్ పేషీలో ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ప్రవీణ్ ప్రకాష్‌కు విజయవాడలో చేదు అనుభవం ఎదురైంది. ఆయన విమానాశ్రయం వైపు నుంచి విజయవాడకు వస్తుండగా గన్నవరం వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. అది గమనించిన గుంటూరు జిల్లాకు చెందిన సత్యం అనే యువకుడు ద్విచక్రవాహనంపై ప్రత్యామ్నాయ మార్గాల్లో తీసుకువెళ్లి ఆయన ఇంటి వద్ద దింపారు. తర్వాత సత్యంను ప్రవీణ్ ప్రకాశ్ సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలి

ఉయ్యూరు, జూన్ 12 : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం చొరవ చూపాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. సుబ్రమణ్యం అన్నారు. కార్మికభవన్‌లో బుధవారం జరిగిన ఉయ్యూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. యూనియన్ మండల అధ్యక్షుడు డి.చింతయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి.రాజేశ్ పాల్గొని ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

చంద్రాభిషేకానికి జనప్రవాహం

- రాష్ట్రం నలుమూలల నుంచి కేసరపల్లికి తరలివచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు
- ఉత్తరాంధ్ర నుంచి పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు
- గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అభిమానుల రాక
- కూటమి జెండాలతో గన్నవరం నియోజకవర్గం కళకళ

హనుమాన్‌జంక్షన్, జూన్ 12 : చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ సభకు వేలాదిగా అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు బుధవారం కేసరపల్లికి తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరావడంతో గన్నవరం ప్రాంతం కూటమి జెండాలతో కళకళలాడింది. పసుపు, ఎరుపు,కాషాయం కండు వాలతో పురుషులు తరలి వచ్చారు. గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రధాని మోదీకి కాషాయం రంగు చీరలతో బీజేపీ మహిళా కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. దీంతో పాటు నరసరావు పేట ఎమ్మెల్యే అరవిందబాబు అభిమానులు స్కూటీలను టీడీపీ, జనసేన, బీజేపీ రంగులు, ఆ పార్టీ నాయకుల ఫొటోలతో సుందరంగా అలం కరించి సభా ప్రాంగణం సమీపంలో కలియ తిరిగారు. మూడు స్కూటీలపై ఆ పార్టీ అభిమానులు ఆయా పార్టీలకు చెందిన కండువాలను తలపాగా వేసుకొని రెండు వేళ్లతో విక్టరీ సంకేతాన్ని చూపుతూ తిరగడం ఆకర్షణీయంగా కనిపించింది. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన టీడీపీ నాయకుడు ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బత్తుల ప్రసాద్ పసుపు రంగుతో కూడిన ఖద్దరు చొక్కా, ఖద్దరు టోపీని ధరించి ఆకర్షణీయంగా కనిపించారు. భారీ జెండాలను చేబూని అభిమానులు, కార్యకర్తలు తరలి రావడంతో గన్నవరంలో పండుగ వాతావరణం నెలకొంది.

ట్రాఫిక్ మళ్లింపు



జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్లిస్తున్న పోలీసులు

కేసరపల్లిలో బుధవారం నిర్వహించిన నూతన రాష్ట్ర ప్రభుత్వం ప్రమాణ స్వీకారం కార్యక్రమం సందర్భంగా పోలీస్ యంత్రాంగం హనుమాన్ జంక్షన్‌లో ట్రాఫిక్ డైవర్షన్ నిర్వహించింది. నేరుగా గన్నవరం మీద ట్రాఫిక్ పడకుండా కేవలం సభకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతి ఇచ్చారు. వైజాగ్ నుంచి, గుడివాడ వైపు నుంచి హైదారాబాద్ వెళ్లే వాహనాలను జంక్షన్ సెంటర్ నుంచి నూజివీడు మీదుగా మళ్లించారు. దూర ప్రాంతాల నుంచి కేసరపల్లి సభకు వెళ్లే వాహనాలకు మాత్రమే జాతీయ రహదారి మీదుగా పంపించి మిగిలిన లోకల్ వాహనాలను సర్వీస్ రోడ్డు ద్వారా మళ్లించారు. ఇదిలా ఉండగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలందరు చూసే విధంగా లైవ్ టెలీకాస్ట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో బాపులపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్డు కూడలిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో లైవ్ టెలీకాస్ట్ ప్రదర్శించారు. భారీ ఎత్తున ప్రజానీకం ప్రత్యక్ష కార్యక్రమాన్ని తిలకించారు.

పోలీసుల అత్యుత్సాహంపై శ్రేణుల ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కేసరపల్లిలో చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవానికి దూరాలను సైతం లెక్కచేయక టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఉదయం 9 గంటలకే సభా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు జాతీయ రహదారిపై హనుమాన్ జంక్షన్ నుంచి బస్సులను, కార్లను ఆపివేయడం మొదలుపెట్టారు. అంపాపురం వద్ద జాతీయ రహదారిపై



పోటెత్తిన అభిమానులను నిలువరిస్తున్న పోలీసులు

బ్యారికేడ్లను అడ్డుపెట్టి పాసులు ఉన్న బస్సులను, వీవీఐపీ పాసులు ఉన్న కార్లను ఆపివేయడంతో టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



అంపాపురం వద్ద పాసులు ఉన్నా నిలిపేసిన పోలీసులు

సమాచారం ముందే తెలిస్తే ఎక్కడిక్కడే ఆగిపోయేవారమని, ఇంత దూరం వచ్చి అభిమాన నాయకుడి ప్రమాణస్వీకారం చూడలేకపోవడం బాధాకర మని నర్సీపట్నంకు చెందిన శ్రీనివాసరావు అనే కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా పోలీసులు అత్యుత్సాహం చూపుతున్నారని, నడిచివెళ్లాలంటూ పోలీసులు సూచించడంపట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులను ఆపివేయడంతో పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద నుంచి మహిళలు, పెద్దవయస్సున్న టీడీపీ కార్యకర్తలు సుమారు 8కిలోమీటర్ల నడిచి సభాప్రాంగణానికి చేరుకున్నారు. సెల్‌ఫోన్‌లలో, అక్కడక్కడ ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌లపై ప్రమాణ స్వీకారం చూస్తున్న టీడీపీ శ్రేణు లు చంద్రబాబునాయుడు అనే నేను అని ప్రమాణస్వీకారం చేయగానే జాతీయ రహదారిపై టపాసులు పేలుస్తూ యువత హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహంతో పాటు వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడంతో తమ అభిమాన నాయకుడి ప్రమాణస్వీకారం ప్రశాంతంగా చూడలేకపోయామని కార్యకర్తలు వాపోయారు.

కష్టపడేతత్వం భారతీయులకే సొంతం

- యుఎస్‌ఏ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ ఎ. లార్సన్

తెలుగువారు సమిష్టితత్వంతో కష్టపడేవారని అందుకే యుఎస్‌ఏలో అత్యధికంగా భారతీయులు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే అధికభాగం ఉన్నారని యుఎస్‌ఏ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ ఎ. లార్సన్



టపాసులతో యువత సంబరాలు



ప్రమాణ స్వీకార ప్రాంగణానికి పరుగులు తీస్తున్న టీడీపీ శ్రేణులు

కొనియాడారని ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం జరిగిన చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి వచ్చిన యుఎస్‌ఏ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ ఎ. లార్సన్‌ను చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల మర్యాద పూర్వకంగా కలిశారు. విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు వల్లే రాష్ట్రానికి చెందిన యువత తమ దేశంలో ఉద్యోగాలు, ఉన్నత చదువులకు వస్తున్నారని ఆమె అన్నారని వారు తెలిపారు. తన పిల్లలు కూడా యుఎస్‌ఏలో ఉద్యోగాలు చేస్తున్నట్లు ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు.

అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారోత్సవం



చంద్రబాబు ప్రమాణాస్వీకారంలో టీడీపీ గన్నవరం నాయకులు

గన్నవరం : మండంలోని కేసరపల్లి మేధా టవర్స్ ప్రక్కన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి టీడీఎ, జనసేన, బీజేపీ నాయకులు, శ్రేణులు తరలివచ్చారు. విమానా శ్రయం, ఐటీ పార్క్ రోడ్డులో సందడి వాతావరణం నెలకొంది. ప్రమాణాస్వీకార సభలో గన్నవరం టీడీపీ నాయకులు పాల్గొని కేరింతలు కొట్టారు. వచ్చిన ప్రముఖులతో మాట్లాడి ఫొటోలు దిగారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలను భారీకేడ్ల వద్ద పోలీసులు ఆపటంతో వాటిని తోసుకుని ప్రమాణాస్వీకార ప్రాంగణానికి పరుగులు తీశారు. జై చంద్రబాబు, జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, ఆళ్ల గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన సభాప్రాంగణానికి తమ్ముళ్లు

గుణదల : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం తమ కళ్లారా చూడాల్సిందేనంటూ తెలుగు తమ్ము ళ్లు తమ వీరాభిమానాన్ని చాటుకున్నారు. రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు వచ్చాక ట్రాఫిక్ స్తంభించింది. దీంతో తెలుగు తమ్ముళ్లు బస్సులు దిగేసి రామవరప్పాడు రింగ్ రోడ్డునుంచి కేసరపల్లిలోని సభా వేదిక వరకు కాలినడకన వెళ్లారు. మరో వీరాభిమాని వళ్లంతా పసుపుమయంగా వస్త్రాలు ధరించి దానిమీద ఎన్టీఆర్, చంద్ర బాబు ఫొటోలు వేసుకుని చేతిలో సైకిల్ బొమ్మ పట్టుకుని వస్తుండటంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.



కాలినడకన సభకు వెళ్తున్న వీరాభిమాని



స్వీట్లు పంచుతున్న అభిమానులు, టీడీపీ నాయకులు

సారథి అభిమానుల సంబరాలు

ఉయ్యూరు, జూన్ 12 : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కళ్యాణ్ మంత్రిపదవులు లభించడం పట్ల ఉయ్యూరులో టీడీపీ, జనసేన పార్టీలు, పార్థసారథి అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కేసరపల్లిలో ఏర్పాటు చేసిన చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ సమావేశంలో మంత్రులుగా పార్థసారథి, పవన్‌కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన దృశ్యాలను ప్రధానసెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో తిలకించి పెద్దఎత్తున టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. హుషారుగా కేరింతలు కొడుతూ సెంటర్‌లో సందడి చేశారు. కుటుంబరావు, సుబ్బారావు, టీడీపీ నాయకులు చిరంజీవి, నజీర్, ఆంజనేయులు తదితరులు సంబరాలు చేశారు.

ఘనంగా ప్రథమ కృతజ్ఞత దివ్యబలిపూజ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 12 : బండారుగూడెంకు చెందిన సిస్టర్ చీలి బన్నుమేరీ కన్నస్త్రీగా అభిషేకించబడిన నేపథ్యంలో బుధవారం సంఘ పెద్దలు ఘన స్వాగతం పలికారు. బండారుగూడెంలోని నిత్య సహాయమాత దేవాలయ చర్చిలో నల్గొండ పీఠాధిపతులు కరణం ధమన్‌కుమార్ పవిత్రహస్తాలతో కన్నస్త్రీగా అభిషేకించబడిన సిస్టర్ బన్ను మేరీ ఆధ్వర్యంలో ప్రథమ కృతజ్ఞత దివ్యబలిపూజ ఘనంగా నిర్వహించారు. ఫాదర్ గోళ్ల విజయ్‌కుమార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వం వచ్చిందంటూ సంబరాలు

- ర్యాలీలు, జెండా ఆవిష్కరణలతో ఎన్టీఆర్‌కు ఘన నివాళి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 12 : నారా చంద్రబాబునాయుడు అనే నేను.. అని టీడీపీ అధినేత ముఖ్యమంత్రిగా, కొణిదల పవన్‌కళ్యాణ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతోనే బాపులపాడు మండల గ్రామాల్లో సంబరాలు మిన్నంటాయి. కాను మోలు, కొత్తపల్లి, వీరవల్లి బిళ్లనపల్లి, తదితర గ్రామాల్లో బుధవారం నూతన ప్రభుత్వం ప్రమా ణస్వీకారోత్సవ సందర్భంగా సంబరాలు నిర్వహించా రు. వీరవల్లిలో లంక సురేంద్రమోహనబెనర్జీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. సంక్షేమాభివృద్ధి చేసే ప్రజాప్రభుత్వం వచ్చేసిందంటూ అజయ్, కలపాల నాని, పిల్లా రామారావు, కలపాల శ్రీధర్ తదిత రులు ప్రజలకు మిఠాయిలు పంచారు. కొత్తపల్లి గ్రామ కూడలిలో రైతులతో కలిసి టీడీపీ నాయకులు వల్లూరిపల్లి నాని, అక్కినేని రవి, పొట్లూరి సుధాకర్, బొబ్బా మోహన్, పొట్లూరి బెనర్జీ తదితరులు జెండా ఆవిష్కరించారు. జనసేన నాయకులు అశోక్, తదితరులతో కలిసి అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి మిఠాయిలు పంచారు. కానుమోలులో మాజీ సర్పంచ్ చింతల వెంకటశివ అప్పారావు, గరిక పాటి ఉమ, సన్నీ, చింతా కృష్ణ, శివశంకర్ ఆధ్వర్యంలో డీజే బ్యాండ్‌తో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆరుగొలనులో బేతా శేషుకుమార్, తుమ్మల బ్రహ్మాజీ తదితరుల ఆధ్వర్యంలో, తిప్పనగుంటలో మాదాల శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి రాజేష్, తదితరుల ఆధ్వర్యంలో, మల్లవల్లిలో యనమదల వెంకయ్యారావు, ఆలూరి సురేష్, అక్కినేని ధర్మరాజు, కృష్ణాజీ తదితరుల ఆధ్వర్యంలో, బిళ్లనపల్లి, కోడూరుపాడు, పెరికీడు, తదితర గ్రామాల్లో ప్రజలకు మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు.



వీరవల్లిలో టీడీపీ నేతల సంబరాలు



కానుమోలులో విజయోత్సవ ర్యాలీ



పెనమలూరులో కేక్ కట్ చేస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరులో..

పెనమలూరు : కేసరపల్లిలో బుధవారం అట్టహాసంగా జరిగిన చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో మండలంలో వాడవాడలా సంబరాలు మిన్నంటాయి. తాడిగడప, కానూరు, పోరంకి, యనమలకుదురు, పెనమలూరుల పెదపులిపాకల్లో టీడీపీ శ్రేణులు ప్రమాణ స్వీకారాన్ని, టీవీలలో, ప్రభుత్వం సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపైనా చూసి సంబరాలు చేసుకొన్నారు. పెదపులిపాక పాల కేంద్రం వద్ద జరిగిన వేడుకల్లో పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొని కేకులు కోసి, బాణసంచా కాల్చి అభినందనలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గంటా విజయలక్ష్మి, వెలివేలు విజయలక్ష్మి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముసునూరి శ్రీనివాసరావు, ముసునూరి శ్రీధర్, గుజ్జర్లపూడి బాబూరావు, గంటా విశ్వేశ్వరరావు, పోలవరపు యుగంధర్, మల్లికార్జునరావు, పోలవరపు నరేందర్‌కుమార్, గుండిమెడ నాగమధు, పాపినేని శ్రీనివాస్, అట్లూరి నారాయణ, వీరవల్లి అనూష తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తనయుడు బోడె వెంకట్రామ్ కేకు కోసి సంబరాలు జరిపారు. టీడీపీ శ్రేణులు బాణసంచా కాల్చి వేడుకలు జరుపుకున్నారు. నేటితో సైకో పాలనకు చరమగీతం పాడినట్లయిందని బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, బొమ్మిడి అన్నపూర్ణ, మోర్ల నరేంద్ర, వనమాల బాబు, గోగం వీరు, కిలారు సుబ్బారావు, ముప్పాళ్ల పూర్ణచంద్రరావు, కోయ రామకృష్ణ, చిగురుపాటి శ్రీనివాస్, లుక్కా అరుణ్, పరిశె వెంకటస్వామి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

కంకిపాడు : చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పరుగులు పెడతుందని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కేసరపల్లిలో బుధవారం నిర్వహించిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కంకిపాడు నుంచి భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి, బాజి, జనసేన పార్టీ నాయకులు బాయిన నాగరాజు, సుంకర శివ, కుంటా గంగాధర్ పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రసార మాధ్యమాల్లో టీడీపీ నాయకులు వీక్షించారు. మండలంలోని మద్దూరు, ఈడుపుగల్లు, తెన్నేరు గ్రామాల్లోని సెంటర్‌లో స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించారు.



హరికృష్ణ ఆధ్వర్యంలో యువత సంబరాలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	146, 155, 166
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.30



అదుపు తప్పి.. లారీ బోల్తా

బంటుమిల్లి : పెదతుమ్మిడి మేజర్ డ్రెయిన్‌లో బుధవారం సాయంత్రం అదుపు తప్పి చేపల లారీ పల్టీ కొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గుడివాడ బంటుమిల్లి మార్గం మధ్యలో పెదతుమ్మిడి వంతెన బలహీనంతో పాటూ రెయిలింగ్‌వాల్ శిథిలమై గోతులతో పూడి ఉంది. కైకలూరు నుంచి చేపల లోడుతో బయలుదేరి పెదతుమ్మిడి బంటుమిల్లి మీదుగా 216 జాతీయ రహదారి ద్వారా బీహార్ వెళ్లనుంది. పెదతుమ్మిడి డ్రెయిన్ వద్ద ఎదురుగా కారు రావడంతో లారీ అదుపు తప్పి డ్రెయిన్‌లో పడిపోయింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

చంద్రబాబు పట్టాభిషేకం.. ఊరూరా సంబరం

జననేత పట్టాభిషేకంతో జిల్లా ఆనందడోలికల్లో మునిగితేలింది. సీఎంగా చంద్రబాబు, మంత్రిగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రమాణస్వీకారం సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్‌చేసి స్వీట్లు తినిపించుకున్నారు. పలుచోట్ల చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. బాణసంచాలు పేల్చి బుధవారం పండుగ వాతావరణం సృష్టించారు.

- పల్లెల్లో ఆనంద తాండవం
- చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం
- కేక్ కట్‌చేసి.. స్వీట్లు పంపిణీ
- బాణసంచాలు పేల్చి కేరింతలు

గుడివాడ : స్థానిక ముబారక్ సెంటర్‌లో ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సంఘం అధ్యక్షుడు దారం నరసింహారావు ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు.

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలోని కోనేరు సెంటర్‌లో, టీడీపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజక కార్యాలయంలో, బస్టాండు సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, రాజుపేట, గొడుగుపేట, ఈడేపల్లిలో కేక్‌లు కట్ చేశారు. బాణా సంచాలు కాల్చారు. మిఠాయిలు పంచారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు.

మోపిదేవి : మోపిదేవిలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన కేక్‌ను మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, కూటమి నేతలు గద్దె శ్రీహరి, భోగిరెడ్డి సాంబయ్య, యక్కటి హనుమాన్, కొమ్ము పవన్ కుమార్ కట్‌చేసి కార్యకర్తలకు అందజేశారు.

కోడూరు : పిట్టలంక, దింటిమెరక గ్రామాల్లో భారీగా బాణాసంచా కాల్చి కేకులు కట్ చేసి మిఠాయిలు పంచారు.

ఘంటసాల : తాడేపల్లిలో టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వినూత్నంగా జనసేన వేడుకలు

మచిలీపట్నం : కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మచిలీపట్నంలో బుధవారం కేసీఎఫ్ యూత్ ఆధ్వర్యంలో జనసేన నాయకులు వినూత్నంగా వేడుకలు చేశారు. జనసేన పార్టీ తరపున గెలుపొందిన 21 మంది శాసనసభ్యులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు పవన్‌కల్యాణ్, కొల్లు రవీంద్ర ఫొటోలతో ఉన్న కేక్‌లను కట్‌చేసి ఆనందం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

అవనిగడ్డ : స్థానిక ప్రధాన సెంటర్‌లో తెలుగుదేశం, జనసేన నేతలు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు.

చల్లపల్లి : మండలంలోని యార్లగడ్డలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. మంగళాపురం సెంటరులో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

కూచిపూడి : చినముత్తేవి, మొవ్వ, కోసూరు, కాజ, నిడుమోలు, పెదపూడి తదితర గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీల నేతలు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచి టపాసులు కాల్చారు.

గుడ్లవల్లేరు : మండలంలోని అన్ని గ్రామాల్లో బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంచుకున్నారు. భారీ కేక్‌లు కట్ చేశారు. లాక్‌డౌన్, పురిటిపాడు గ్రామాలకు చెందిన మహిళలు, బాల, బాలికలు ప్రధాన కూడలిలో కోలాట ప్రదర్శన చేశారు.

గుడివాడ రూరల్ : చౌటపల్లిలో పెద్ద కేకులు కట్ చేసి స్వీట్లు, మిఠాయిలు వందలాది మందికి పంపిణీ చేశారు.

పామర్రు : స్థానిక గ్రామ పంచాయతీ వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.



చల్లపల్లి మండలం యార్లగడ్డలో సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు



గుడ్లవల్లేరు ప్రధాన వ్యాపార కూడలిలో కోలాటం ఆడుతున్న మహిళలు, బాల బాలికలు

పెడన : బస్టాండ్ సెంటర్‌లోని తెలుగుదేశం స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. 14వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకార సమయంలో టపాసులు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు.

పెదపారుపూడి : చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం మహోత్సవానికి పెదపారుపూడి మండలం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బుధవారం గన్నవరం మండలం కేసరపల్లిలోని ఐటీ టవర్స్ దగ్గర ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి తరలివెళ్లారు.

గెలుపు మొక్కులు తీరాయి!



కేంద్ర పశుసంవర్ధక, మత్స్యశాఖా మంత్రి సంజయ్‌నిషాల్‌ను కలిసిన మంత్రి కొల్లు రవీంద్ర

మత్స్యకారుల సంక్షేమంపై దృష్టి

- కేంద్ర మంత్రితో కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 12 : సముద్ర తీర ప్రాంతాల్లో చేపల వేటను ఆధారంగా చేసుకుని జీవిస్తున్న మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారిద్దామని కేంద్రమంత్రి డాక్టర్ సంజయ్ నిషాల్‌తో చర్చించినట్టు మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం కేంద్ర మంత్రితో గిలకలదిండి ప్రాంతంలో మత్స్యకారుల అభివృద్ధికి, షిప్పింగ్ యార్డు అభివృద్ధికి చేపట్టవలసిన అభివృద్ధి పనులపై చర్చించినట్టు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. వేసవి కాలంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే భృతిపై చర్చించామని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు మత్స్యకారులను ఏ విధంగా ఆదుకోవాలో మాట్లామని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై కదలిక

మచిలీపట్నం టౌన్, జూన్ 12 : నిన్న మొన్నటి దాకా వైసీపీ పాలనలో ఉన్న సచివాలయాలపై టీడీపీ కార్పొరేటర్లు, నాయకులు జెండాలు ఎగురవేస్తున్నారు. కేకులు కట్ చేశారు. తమ డివిజన్లలోని సమస్యలపై కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు సచివాలయ కార్యదర్శులతో చర్చించారు. 45వ డివిజన్‌లో టీడీపీ ఇన్‌ఛార్జి పి.వి. ఫణికుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. 45వ డివిజన్ పరిధిలోని రెవెన్యూ కళ్యాణ మండపం, రైతుబజారు వద్ద పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కావలసిన చర్యలు చేపట్టాలని సచివాలయ అడ్మిన్ అల్లాభక్షు, వీఆర్వో పెదబాబు, రామాంజనేయులుతో చర్చించారు.



చల్లపల్లిలో ఆలయం వద్ద పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించిన యువ నేత మండలి వెంకట్రామ్

- చల్లపల్లి నుంచి మోపిదేవి ఆలయం వరకు జనసైనికుల పాదయాత్ర

చల్లపల్లి, జూన్ 12 : చల్లపల్లి మండల జనసేన నాయకులు చల్లపల్లి బస్టాండ్ సెంటరులోని శ్రీపంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయం నుంచీ మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వరకు బుధవారం పాదయాత్ర చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా చల్లపల్లి నుంచీ మోపిదేవి వెళ్లి 101 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. చల్లపల్లి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పాదయాత్రను ప్రారంభించారు. ఉత్సాహంతో కాలినడకన మోపిదేవి చేరుకున్న జనసైనికులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బోడగం విమల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, తోట కనకదుర్గ, సూదాని నందగోపాల్, సోమిశెట్టి రాఘవేంద్రరావు, కలపాల ప్రసాద్, గోళ్ల ప్రసాద్, బళ్ల శ్రీదేవి, తోట మురళీకృష్ణ, గంగిరెడ్డి రాజేంద్ర, అడపా రవి, కూరేటి రాఘవ, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొక్కుబడుల చెల్లింపు

నందివాడ (గొంగళ్లమూడి) : గుడివాడ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము గెలవాలని, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాలని ఎన్నికల ముందు గొంగళ్లమూడి టీడీపీ అభిమానులు వల్లూరి సాంబశివరావు - పూర్ణ కుమారి దంపతులు గొంగళ్లమూడిలోని రామాలయంలో 101 కొబ్బరికాయలు కొడతామని మొక్కుకున్నారు. ఇందులో భాగంగా అనమనపూడి శివారు గొంగళ్లమూడి రామాలయంలో చంద్రబాబు ప్రమాణస్వీకారం సమయంలో సాంబశివరావు - పూర్ణకుమారి దంపతులు రామాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం కుమారులు మురళీ, హరికృష్ణ.. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి బాణాసంచా కాల్చారు. 500 మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.



మొక్కుబడి తీర్చుకుంటున్న పూర్ణ కుమారి

తోట్లవల్లూరు : పామర్రు నియోజకవర్గంలో తొలిసారిగా టీడీపీ ఎమ్మెల్యేగా వర్ల కుమార్ రాజా గెలుపొందినందుకు గరికపర్రు గౌడ పాలెంలో పంచముఖ ఆంజనేయస్వామికి టీడీపీ కార్యకర్తలు 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కనకవల్లి ఉప సర్పంచ్ వీరంకి పరశురామ్ ఆధ్వర్యంలో వీరంకి చిరంజీవి, బోలెం వెంకటేశ్వరరావు, వీరంకి శ్రీను, బోలెం శ్రీను, వీరంకి గిరి, మరీదు వెంకటేశ్వరరావు, వీరంకి అంజయ్య, వీరంకి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లుకు బండి రామకృష్ణ అభినందనలు

మచిలీపట్నం టౌన్, జూన్ 12 : మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బందరు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్రను మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మండల జనసేన అధ్యక్షుడు గల్లా తిమోతి, నెలకుర్రు సర్పంచ్ బొమ్మసాని నరేష్ కలిసి అభినందనలు తెలిపారు.



కొల్లు రవీంద్రను కలిసి అభినందనలు తెలియజేస్తున్న బండి రామకృష్ణ

వల్లభనేని బాలశౌరిని కలిసిన బండి రామకృష్ణ



ఎంపీ వల్లభనేని బాలశౌరిని కలిసి అభినందించిన బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జూన్ 12 : మచిలీపట్నం ఎంపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వల్లభనేని బాలశౌరికి బుధవారం జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మండల అధ్యక్షుడు గల్లా తిమోతి, నెలకుర్రు సర్పంచ్ బొమ్మసాని నరేష్ కలిసి అభినందనలు తెలిపారు.

అయ్యప్పనగర్‌లో పారిశుధ్య డ్రైవ్

పామర్రు : స్థానిక పంచాయతీ పరిధిలోని అయ్యప్పనగర్ కాలనీలో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పొక్లెయిన్‌తో రోడ్లపై పెరుకుపోయిన చెత్తచెదారాలను తొలగించారు. ఎక్కడా మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడంతో కాలనీ వాసులు కార్యదర్శి చొరవను అభినందించారు.

వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు

మోపిదేవి, జూన్ 12 : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లి కృష్ణానది తీరాన కొలువై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామివారి మహాకుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివార్లను విశేష అలంకరణ చేయగా, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

చేపల నీటితో తుమ్మలపల్లి వాసులు అవస్థలు

నందివాడ (తుమ్మలపల్లి), జూన్ 12 : చేపల చెరువుల యజమానులు చెరువుల్లో నీటిని పంట కాలువల్లోకి వదలటంతో తుమ్మలపల్లి లే అవుట్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు వదిలితే ఈ నీళ్లే గ్రామాలలోని పంచాయతీ మంచినీటి చెరువుల నింపాలని, ఈ చేపల చెరువుల నీళ్లతో చెరువులు నింపుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థ పదార్థాలు కూడా ఈ నీటిలో కలిసి మంచినీటి చెరువులు నింపటంతో ప్రజలు అనారోగ్యాలకు పాలవుతున్నారని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి చేపల చెరువుల్లో మురుగు నీరు పంట కాలువల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ముగింపు సన్నివేశంలో కళాకారుడు బోలెం రామారావు, వేదికపై స్వచ్ఛ బృందం

ఆకట్టుకున్న 'పర్యావరణ ప్రాణదాతలు'

చల్లపల్లి, జూన్ 12 : ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ పార్కులో జరుగుతున్న నాటక ప్రదర్శనల్లో భాగంగా ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు స్వీయ రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన పర్యావరణ ప్రాణదాతలు సాంఘిక, సందేశాత్మక నాటకం ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణ ప్రధానాంశంగా సాగిన నాటకంలో తాటిచెట్ల వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రకృతిని ఎలా ప్రేమించాలి? పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలి? అనే అంశాలను వివరిస్తూ, చివరలో పర్యావరణ పరిరక్షణ.. పరిశుభ్రత కోసం అవిశ్రాంతంగా కృషిచేస్తున్న డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి నేతృత్వంలోని స్వచ్ఛ ఉద్యమం గురించి చెబుతూ డీఆర్కే. దంపతులను, స్వచ్ఛ కార్యకర్తలను వేదికపైకి ఆహ్వానించి నాటకాన్ని ముగించారు. బోలెం రామారావు ప్రధాన పాత్రలో నటించగా, ప్రముఖ కోలాటం గురువు వేముల అంకంబొట్లు, ఏవో బోలెం అనంతలక్ష్మి, నాగమునేష్, నిర్ధేష్‌సాయి, జన్ని నటించారు.

పత్రికా రంగానికి రామోజీరావు ఎనలేని సేవలు

పెడన, జూన్ 12 : పత్రికా రంగానికి రామోజీరావు ఎనలేని సేవలందించారని పాత్రికేయులు ప్రశంసించారు. పెడన ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ, పత్రికా రంగంలో నూతన ఒరవడులు నెలకొల్పిన ఘనత రామోజీరావుదేనన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన అలుపెరుగని కృషి చేశారన్నారు. తొలుత రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాత్రికేయులు నందం రవికుమార్, పుట్టి కృష్ణప్రసాద్, యెండూరి సుబ్రహ్మణ్యం, అద్దంకి శంకర్, పృథ్వీకోటయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

ఘనంగా మరియతల్లి గ్రామోత్సవం

కోడూరు, జూన్ 12 : మండల పరిధిలోని పెద ఉల్లిపాలెం ఏసుతిరు హృదయ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి) పందేళ్ల వేడుకల్లో భాగంగా బుధవారం మరియతల్లి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో మరియమాత స్వరూపాన్ని ఉంచి విశ్వాసులు భుజాలకెత్తుకుని మేళతాళాలతో ఊరేగించారు. కోడూరు ఆర్‌సిఎం చర్చి విచారణ గురువు చౌటపల్లి ప్రశాంత్ విశ్వాసుల ఇళ్ల వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు.